నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

మంగళవారం 14 ఫిబ్రవరి 2023

ప్రయివేటు కూలీలతో పారిశుధ్య పనులు



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో ప్రయివేటు కూలీలతో పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ దండబోయిన సంజీవ్ తెలిపారు. సోమవారం పనులు పరిశీలించారు. గత తొమ్మిది రోజుల నుండి ఇతర గ్రామంలోని కూలీలతో గ్రామంలోని డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేస్తున్నామని, వ్యర్థపదార్థాలను గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని తెలిపారు. పారిశుధ్య పనులను సర్పంచ్‌తో పాటు సెక్రటరీ క్రాంతి పరిశీలించారు.

కంటివెలుగు టీమ్‌కు సన్మానం



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గుల్లా తండాలో కంటి వెలుగు టీమ్‌ను స్థానిక సర్పంచ్ అనుషాబాయి, ఉప సర్పంచ్ అనీల్ సన్మానించారు. రెండు రోజులుగా తండాలో కంటి వెలుగు పరీక్షలు విజయవంతంగా నిర్వహించినందుకు గాను స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు అందజేశారని, తీవ్ర సమస్యలున్నట్టు తేలిన వారికి కంటి ఆపరేషన్ నిర్వహించనున్నట్టు కంటి వెలుగు బృందం పర్యవేక్షకుడు డా. విక్రమ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్, ఆశాలు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోలీసులకు ఉల్లాసం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- గెలిచినా.. ఓడినా పండుగ వాతావరణం : సీపీ నాగరాజు
- స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌ను ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేడు రాష్ట్రం శాంతి భద్రతలతో ఉందంటే అది పోలీసుల విధి నిర్వాహన అని, యునిఫామ్ సర్వీస్‌లో ఉన్నటువంటి వారు 24/7 విధినిర్వహణలో ఉంటారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ఇతర శాఖల వారికి అన్ని రకాల సెలవు దినాలు ఉంటాయని, అన్ని రకాల పండుగలు ఉంటాయని కానీ పోలీస్ సిబ్బందికి ఎలాంటి సెలవులు, పండుగలు ఉండవని, వారు ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉంటారని చెప్పారు. అలాంటి నిర్విరామ విధులలో ఉన్న పోలీసులకు ఈ 'స్పోర్ట్స్ గేమ్స్ మీట్' ఉత్సాహంతో పాటు ఉల్లాసాన్ని కలిగిస్తుందని, సిబ్బందికి ఎల్లప్పుడు పని వత్తిడితో తట్టుకోవడానికి ఎల్లప్పుడు వారికి అన్ని రకాల బలాన్ని కలిగించడానికి, శక్తిని ఇవ్వడానికి ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాన్యువల్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ - 2023ను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్, పోలీస్ కమిషనర్ నాగరాజు సోమవారం ప్రారంభించారు. మొదటగా జిల్లా కలెక్టర్ పరేడ్ గౌరవ వందనం స్వీకరించి పతాకావిష్కరణ చేసి, జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవాతే శ్రీనివాస్ ఒలంపిక్ కాగడ చేత భూని క్రీడాజ్యోతిని తీసుకొని పరేడ్ గ్రౌండ్ చుట్టు రన్ చేశారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడల వల్ల వ్యక్తులకు వ్యక్తులకు మధ్య ఒక చక్కని బంధం ఏర్పడుతుందని అన్నారు. ఈ క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించడం ఎంతో అభినందనీయమని, గెలుపోటములను ఏదైనా స్ఫూర్తిగా



పోలీస్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్, సీపీ

తీసుకోవాలని, అందరూ కట్టుబడి మీ ఆటలు జరగాలని తెలియజేశారు. క్రీడా కారులు జిల్లాస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో కూడా మంచిగా రాణించాలని కోరారు.

అనంతరం సీపీ కెఆర్ నాగరాజు మాట్లాడుతూ.. కోవిడ్‌తో మూడేండ్లుగా ఈ క్రీడలు నిర్వహించలేమని, మళ్లీ సాధారణ వాతావరణం ఉన్నందున క్రీడలు మళ్లీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ విభాగంలో విధినిర్వహణలో క్రీడలు అనేవి ఎంతో అవసరమైనవని, మనం అందరం ఎంతో కఠినమైన పరిస్థితి ఎదుర్కొన వలసి వస్తుంది అని, శారీరకంగాకాని, ఈ క్రీడలు అంటేనే ఒక పండుగ వాతావరణం అని, సిబ్బంది 24/7 విధులు నిర్వహించడం వలన తమ ఆరోగ్య బాగోగులు గురించి మరచి పోతుంటారని తెలిపారు. ఈ క్రీడల వలన ఆరోగ్యం ఉత్సాహంగా ఉంటుందని, సిబ్బందికి ఈ మధ్య స్ట్రెస్ మేనేజ్మెంట్ అనేది వచ్చిందని, వారం చివరలో ఉల్లాసంగా గడపడానికి తోడ్పడుతుందని అని అన్నారు. ఎన్ని చాలేంజీలు వచ్చిన కూడా సిబ్బంది ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారని, ఈ క్రీడలు 3 రోజులు నిర్వహిస్తున్నామని, కాని ఇక్కడ క్రీడలలో ఓడినా, గెలిచినా పండుగ వాతావరణం మాత్రమే ఉంటుందని చెప్పారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ సబ్ డివిజన్‌లు, ఆర్మ్‌డ్ రిజర్వు, హెూమ్ గార్డ్సు విభాగం, అలైడ్ బ్రాంచ్లు, పోలీస్ కార్యాలయం సిబ్బంది జట్ల మధ్య వాలీబాల్, బాస్కెట్ బాల్, కబడీ, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జవలిన్ అథెలిటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆఫ్ పోలీస్ గిరిరాజు, నిజామాబాద్, ఆర్మూర్, ట్రాఫిక్, ఎర్, ఆర్, హెూమ్ గార్డ్సు ఎ.సి.పిలు కిరణ్ కుమార్, ప్రభాకర్‌రావు, నారాయణ, సంతోష్ కుమార్, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్స్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న పోలీసులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం సరికాదు

- తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తాం
- సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-మాక్లూర్

మధ్యాహ్న భోజన కార్మికులను అకారణంగా తొలగించడం సరికాదని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పి చక్రపాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తహసీల్దార్ శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కార్మికులను అనేక విధాలుగా అనేక రకాలుగా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తు రాజకీయ నాయకుల అండదండలతో అక్రమంగా తొలగించడం పద్ధతి కాదని అన్నారు. గుత్ప గ్రామంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు కొండ జమునను అకారణంగా జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు తొలగిస్తూ, కొత్తవారిని నియమించుకున్నారని అది సరికాదని అన్నారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి కష్టపడి పని చేస్తూ సేవలందిస్తున్న వారిని గుర్తించకుండా తప్పులను విచారణ చేయకుండా, కనీసం షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా ఆకస్మాత్తుగా తొలగించడం సరికాదని అన్నారు. ఇదంతా ఎంఈఓ, ఎంఆర్ఓ ఆధ్వర్యంలో జరగాల్సిందని, కానీ అలా కాకుండా ఒక ఎస్ఎంసి కమిటీ చైర్మన్ చెప్పిన విధంగా తొలగించడం విరుద్ధమని వెంటనే తిరిగి యధావిధిగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల మధ్యాహ్న భోజన కార్మికులు సాయమ్మ, రామకృష్ణ, బాలరాజు, భూదేవి, రామచంద్ర పల్లి సాయమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని పేర్కొన్నారు. మొత్తం 65 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సాయన్న, పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదలు మరింత పేదలయ్యారు

- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-భిక్కనూర్



కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. సోమవారం మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన 50 మంది వివిధ పార్టీల నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు మరింత పేదలుగా మారారని, రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే, కెసిఆర్ కుటుంబంలో నలుగురికి పదవులు లభించాయని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, తెలంగాణ ప్రైవేటు ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వెంకన్నగారి బాగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, అందే దయాకర్ రెడ్డి, లింబాద్రి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, తిరుమల్ స్వామి, స్వామి, కర్నాల శ్రీనివాస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక

మండలంలోని తిప్పాపూర్ గ్రామ నూతన కాంగ్రెస్ కమిటీని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షునిగా ధర్మయ్య, ఉపాధ్యక్షులుగా మోహన్ రెడ్డి, సిద్దయ్య,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కిషన్,బీసీ సెల్ అధ్యక్షులుగా భూమయ్య,ఎస్సీ సెల్ అధ్యక్షులుగా మహేష్, కిసాన్ సెల్ అధ్యక్షులుగా జగన్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లింగారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ మంద నర్సింలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు అనుమతివ్వండి

- కలెక్టరేట్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం
- అవినీతిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన



బాధత యువకుడితో మాట్లాడుతున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

మద్నూర్ మార్కెట్ యార్డులో అవినీతి జరిగిందని సాక్షాదారాలతో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేయడంతో తనకు మానసికంగా బెదిరింపులు, దాడులు పెరిగాయని కావున తనకు ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఓ యువకుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన కామారెడ్డి కలెక్టరేట్ వద్ద సోమవారం కలకలం రేపింది. ఎస్సై అప్రమత్తతతో యువకుడు ప్రాణం నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం అవల్ గావ్ గ్రామానికి చెందిన సిద్ధప్ప అనే యువకుడు రెండు సంవత్సరాల క్రితం మద్నూర్ మార్కెట్ యార్డులో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఆర్టీఐ ద్వారా మార్కెట్ కమిటీకి వచ్చే నిధులు, ఖర్చుల వివరాలు కోరాడు.

వివరాలు మెయిన్‌లో..

గిరిజన సంఘం మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-గాంధారి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గిరిజన సంఘం మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ పిలుపునిచ్చారు. గాంధారి మండల కేంద్రంలో సోమవారం స్థానిక గిరిజనులతో కలసి మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల కాలం నుండి గిరిజన సంఘం అనేక పోరాటాలు నిర్వహించినట్టు తెలిపారు. ఇంకా గిరిజనుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగుతుందని చెప్పారు. పలు బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఇటీవల సీఎం కేసీఆర్ అసెంబ్లీలో నిర్ణయించడం సరికాదని, ప్రతి ఒక్క గిరిజన నాయకులు దీన్ని ఖండించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి కార్యక్రమాలు కేసీఆర్ చేపడితే పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, రతన్, రామలక్ష్మి హెూలీ ,గిరిజన సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

సరస్వతి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు

నవతెలంగాణ-పిట్లం



ప్రొసీడింగ్ కాపీ అందజేత

మండల కేంద్రంలో సరస్వతి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల నుండి 10 లక్షల రూపాయలు మంజూరైనట్లు జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హన్మంత్‌షిండే గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఎంపీపీ కవిత విజయ్ కృషితో ఎస్ డి ఎఫ్ నిధుల నుండి మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రొసీడింగ్ కాపీని సరస్వతీ శిశు మందిర్ పాఠశాల అధ్యక్షుడు కుమ్మరి రాములుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి , కమ్యూనిటీ హాల్ కోశాధికారి బొడ్ల రాజు , బద్రి తదితరులు పాల్గొన్నారు.

నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయం

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయమని మాలమహానాడు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి నీరడి సాయికుమార్ అన్నారు. సోమవారం లింగంపేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా అంబేద్కర్ గారి 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున నెలకొల్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో కూడా దళితుల పట్ల తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో దళిత బంధుకు సంక్షేమ శాఖకు అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం భారీగా కేటాయింపులు జరపడం పట్ల సంతోషకరమన్నారు. మంత్రులు కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సహకరించిన సహచర ఎమ్మెల్యే ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ ధన్యవాదాలు తెలిపారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు సన్మానం



సన్మానచేసి పుష్పగుచ్చం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-లింగంపేట్

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను ఆయన చాంబర్‌లో లింగంపేట్ జడ్పీటీసీ, స్థానిక సంస్థల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏలేటి సంతోష్‌రెడ్డి, రాష్ట్ర జడ్పిటిసిల ఫోరం ప్రధాన కార్యదర్శి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి సోమవారం శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాసనమండలిలో అపార అనుభవం ఉండటంతో ఆయనకు డిప్యూటీ చైర్మన్ పదవి అప్పగించినట్టు తెలిపారు. డిప్యూటీ చైర్మన్ పదవి ముదిరాజ్‌లకు దక్కడం హర్షించదగ్గ విషయమన్నారు.

సంఘ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-భిక్కనూర్



ఎన్నికైన కమిటీ

భిక్కనూర్ పట్టణ ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడిగా నియమితులైన గజవాడ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక నగరేశ్వర ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. గజవాడ నాగరాజును 14వ సారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా పబ్బ నాగరాజు, జనరల్ సెక్రెటరీగా గంగెల్లి మధు, కోశాధికారిగా కోడిపాక ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా అతిమముల రమేష్, పురం రాజమౌళి, జాయింట్ సెక్రటరీగా అతిమముల శ్రీనివాస్, గంజి శ్రీనివాస్, పబ్బ సాయినాథ్, శ్రీనివాసులు, కైలాసం,దన్నారపు శీను, చీకోటి ప్రభాకర్, కృష్ణమూర్తి, చల్ల మల్లేశం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-నిజాంసాగర్



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

మండలంలోని మగ్దూంపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి సోమవారం ఉదయం సర్పంచ్ లక్ష్మి నారాయణ భూమి పూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలు మంజూరు కావడంతో నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడీ, గాలిపూర్ సర్పంచ్ లక్ష్మ రెడ్డి, నాయకులు రాంచందర్, గంగారాం, భాను ప్రసాద్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పాలకుల ప్రజావ్యతిరేక నిర్ణయాలు ప్రజల్లోకి తీసుకెళ్తా

నవతెలంగాణ-లింగంపేట్



నియామకపత్రం అందుకుంటున్న గోవింద్

కేంద్ర, రాష్ట్ర పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మత్తూర గోవింద్ తెలిపారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఆయనను నియమిస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లమడుగు షరీఫ్ సోమవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో యువకులను చురుగ్గా పార్టీలోకి తీసుకురావడంలో తన సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

CHANGE OF NAME

I, **Mahmad Taharkhan** S/O Rahiman Khan R/O 5-12-291/1/A, Gajulpet, Nirmal-504106, T.S. Changed **My Name As Mohammed Taher Khan S/O Rahman Khan.**

SAWAN SABOO - 9440560256

విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ముప్కాల్

ఎస్ఐ విజయ్ నారాయణ జన్మదినం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యువజన సంఘం నాయకులు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీ హర్ష మొబైల్ యజమాని ద్యావర్ శెట్టి శ్రీధర్, యువజన సంఘం నాయకులు జక్కుల శ్రీను, చిల్క దినేష్, ముస్కు రాజేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూముల కబ్జాదారుల పై చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని నిర్మాణ పనులు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంబీటీ జిల్లా అధ్యక్షులు ఎం.డి జహీరుద్దీన్ జావిద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాలపల్లికి చెందిన ఎంబిటి తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని ప్రజావాణిలో అందజేశారు. ఈసందర్భంగా ఎంబీటీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు రాజకీయ అండదండలతో భూ కబ్జాకు పాల్పడు తున్నారని ఆరోపించారు. నిర్మాణ పనులు చేపడుతుండగా వారిని నిలదీసిన తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే భూకబ్జాదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మీర్ బశరత్ అలీ, సాజిద్, సోహెల్ సలీం, ఆఫీల్ అంజాద్, ఎస్.కె బాబుచ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన బాధితులు
- పలు సమస్యలపై వినతులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 87 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జెడ్పి సీఈఓ గోవింద్, డీ ఆర్ డీ ఓ చందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్‌లో అప్లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టా భూముల సమస్య పరిష్కారం చేయండి అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం సర్వేనెంబర్ 532, గడ్కోల్‌లోని సర్వేనెంబర్ 100లో పేదలకు ఇచ్చిన పట్టా భూములకు ఫారెస్ట్ అధికారుల అడ్డంకులు తొలగించి పరిష్కారం చేపట్టాలని, జాయింట్ సర్వేలో రెవెన్యూ భూమిగా గుర్తించినా కూడా ఫారెస్ట్ అధికారులు జాయింట్ మినిట్స్‌పై సంతకాలు చేయకుండా వాయిదాలు వేయటం విచారకరమని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ప్రభాకర్ అన్నారు. నూతన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు పూల బొకేను అందించిన అనంతరం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వి.ప్రభాకర్ మాట్లాడుతూ... బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు సిరికొండ, గడ్కోల్‌లో హైకోర్టు తీర్పు అనుసరించి ఫారెస్ట్ శాఖ రెవెన్యూ శాఖలు నాలుగు సార్లు సర్వే చేశాయని, అది రెవెన్యూ శాఖ భూమిగా కూడా గుర్తించిందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు సర్వే హద్దుల మ్యాపును చూపించి వివరించడం జరిగిందని అన్నారు. 2015లో హైకోర్టు ఆర్డర్ ఇచ్చిన ఫారెస్ట్ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ భూములుగా తేలిన గ్రామాల పేదలకు పట్టా భూములకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏఐపి కే ఎం ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవరాం, జిల్లా కార్యదర్శి గుమ్మల గంగాధర్, సహాయ కార్యదర్శి బాబన్న, అనీష్, సిరికొండ, గడుగోల్ గ్రామాల భూ పట్టాదారులు, రైతులు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్‌ని మార్చండి ప్రభో..

కంఠేశ్వర్: ఎన్నిసార్లు వినతులు ఇచ్చినప్పటికీ వెల్‌నెస్ సెంటర్‌ను మార్చడం లేదని, ప్రభుత్వాస్పత్రిలోని నాల్గవ అంతస్తు ఎక్కాలంటే రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అన్ని సౌకర్యాలు గల బిల్డింగ్ లోకి మార్చాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నాల్గవ అంతస్తులో ఉండటం మూలాన రిటైర్డ్ ఉద్యోగులు వైద్య సహకారం పొందటంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి వెనుక భాగానగల ఖాళీగా ఉన్న నర్సింగ్ కాలేజ్, మెప్మా బిల్డింగ్ అనుకూలంగా ఉన్నాయని జిల్లా అధ్యక్షులు కే .రామ్మోహన్‌రావు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి ఎస్. మదన్ మోహన్, గౌరవ అధ్యక్షులు దత్తాత్రేయరావు, కోశాధికారి ఈవీల్ నారాయణ, సహాధ్యక్షులు సుదర్శన్ రాజ్, ఉపాధ్యక్షులు జార్జ్, భోజరావు, లావు వీరయ్య, ప్రసాద్ రావు, అందే సాయిలు, తదితరులు పాల్గొన్నారు .



ప్రజావాణిలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కొడుకులు బువ్వపెట్టేలా చూడండి సారూ..

కొడుకులు బువ్వపెట్టేలా చూడండి సారూ..అంటూ వృద్ధదంపతులు న్యామతాబాద్ గంగాజి, లక్ష్మి బాయిలు వచ్చి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నగరంలోని నర్సగౌడ్ వీధిలో నివాసముంటున్నామని వృద్ధ దంపతులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి అయ్యా మీరైనా మాకు న్యాయం చేసి తమకు కన్న కొడుకులే అన్నం పెట్టే విధంగా చూడాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. తమకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, ప్రస్తుతం ఉన్న మడిగెల నుంచి వచ్చే అద్దె డబ్బులతోనే జీవనం కొనసాగుతుందని తెలిపారు. బుక్కెడంత బువ్వ పెట్టకుండా పైగా మడిగె కిరాయి ఇవ్వాలని కొడుకులు వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ వయసులో వంట చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని, ఆరోగ్యం సహకరిస్త లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి కలెక్టర్ సారు... స్పందించి మాకు న్యాయం చేసి ప్రాణం ఉన్నంత వరకు కొడుకులు తిండి పెట్టేలా చూడాలని వేడుకున్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధ దంపతులు

ఆపన్నహస్తం అందించండి

అంబులెన్స్‌లో వచ్చి కలెక్టర్‌కు బాధితుడి మొర

ఆపన్నహస్తం అందించాలంటూ అంబులెన్స్ లో బాధిత కుటుంబ సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి తరలి వచ్చి కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అల్వాల పవన్ మాట్లాడుతూ.. నగరంలోని దుబ్బలో నివాసం ఉంటున్నామని అన్నారు. పెయింటింగ్ పని చేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగించేవాడినని, ఏడు నెలల క్రితం ఆనంద్ నగర్‌లో రెండంతస్తుల భవనానికి పెయింటింగ్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు కింద పడడంతో వెన్నుపూసకు తీవ్రంగా దెబ్బ తగలడంతో మంచానికే పరిమితమయ్యానని అన్నారు. వైద్యం కోసం అప్పులు చేసిన ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటివరకు ఆస్పత్రిలో ఐదు లక్షల వరకు ఖర్చు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు 15 వేలు ఫిజియోథెరపీ కి ఖర్చు అవుతుందని అన్నారు. కుటుంబ పోషణ భారమై ఇంటి అద్దె చెల్లించలేక భార్య పిల్లల ఆకలి తీర్చలేక, దీనస్థితిలో ఉన్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం తరఫున ఆపన హస్తం అందజేసి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరాడు. దాతలు సైతం ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా సహాయం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



కుటుంబీకులతో అంబులెన్స్‌లో వచ్చిన అల్వాల పవన్

మాజీ జెడ్పిటిసి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శక్కరి కొండ ధర్మపురి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ వీ గంగాధర్ గౌడ్ సోమవారం పరామర్శించారు. అనంతరం శక్కరి కొండ ధర్మపురి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతికి గాల కారణాలను అడిగి తెలుసుకుని తామంతా వెన్నంటే ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు శక్కరికొండ కృష్ణ, జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి నర్సాగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నల్ల హరికిషన్, ఘన్పూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గడ్డం గంగాధర్ తదితరులు ఉన్నారు.

కబ్జాలో ఉన్న భూములకు పట్టాలివ్వాలని వినతి

ఆర్డీఓ కార్యాలయానికి తరలివచ్చిన మంధర్న వాసులు



ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన మందర్న గ్రామస్తులు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం మందర్న గ్రామ శివారులో గల ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే పట్టాలివ్వాలని కోరుతూ సోమవారం మందర్న గ్రామానికి చెందిన పలువురు బోధన్ ఆర్డీఓ కార్యాలయానికి తరలివచ్చి ఆర్డీఓ రాజేశ్వర్ కు వినతిపత్రం అందించారు. ఈ సంధర్భంగ వారు మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నామని వాపోయారు. కావున అర్హులైన కుటుంబాలకు తక్షణమే భూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

23వ వార్డులో మురికి కాలువలు నిర్మించండి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ 23వ వార్డు శ్రీనివాస్ నగర్ కాలనీలో డ్రైనేజీలు లేక కొంతకాలంగా తీవ్ర దుర్గంధంగా తయారైందని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జంగం అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మురికి కాలువలు లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై పారుతూ లోతట్టు ప్రాంతాలలో చేరడంతో దోమల బెడద విపరీతంగా తయారైందని పేర్కొన్నారు. శ్రీనివాస నగర్ కాలనీ కుక్కల గుట్ట ప్రాంతంలో మురికి కాలువలు నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.

నజీర్ విజిలేస్తే అంత 'గప్ చుప్'

నవతెలంగాణ-నవీపేట్

ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు సురక్షితంగా ఎక్కాలన్నా, ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కావాలన్నా, అల్లరి మూకలు చెదిరిపోవాలన్నా.. నజీర్ విజిలేస్తే అంత గప్ చుపే.. ఆదివారం రాత్రి నవీపేట్ బస్టాండ్‌లో కొందరు అల్లరి మూకలు గ్రూపులుగా విడిపోయి పిడిగుద్దులకు పాల్పడగా అక్కడే జీతం తీసుకోని షాడో పోలీస్ గట్టి గట్టిగా విజిలెయ్యడంతో అల్లరి మూకలు పోలీసులే వచ్చారనే భయంతో పారిపోయారు. నిజంగా అక్కడ నజీర్ లేకుంటే శాంతిభద్రతలకు విఘాతమే కలిగేదని పలువురు చర్చించుకున్నారు. గతంలోనూ వైన్స్ వద్ద ఘర్షణ జరగగా పరిగెత్తుకుంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు వచ్చి లాఠీలకు పని చెప్పి ఘర్షణ సద్దుమణిగేలా చేశారు. మండల కేంద్రంలో వారాంతపు సంతతో పాటు మేకల సంత, రైల్వే గేటు చీటికి మాటికి పడడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. 15 ఏండ్లనుండి చేతిలో ఒక కట్టె నోట్లో విజిల్ వేసుకొని పిచ్చోడిలా చిల్లర డబ్బులు అడుక్కొని తిరిగే నజీర్ శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలు తీర్చడంలో స్వచ్ఛంద సేవకుడిగా పనిచేస్తున్నాడని అనటంలో అతిశక్తి లేదు..



కర్ర, విజిల్‌తో నజీర్

చైర్ పర్సన్‌ను పదవి నుండి తొలగించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్‌ను పదవి నుంచి తొలగించాలని బిజెపి ఫ్లోర్ లీడర్ నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు .మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్థానంలో మరిది పండిత్ ప్రేమ్ కుమార్ కుర్చీలో కూర్చోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేసి చైర్ పర్సన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

16,17న పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని బీఈ డీ కళాశాలకు చెందిన మూడవ సెమిస్టర్ (ఈపిసి-3, ఈపిసి-4) ఫేజ్-1 ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 16, 17న నిర్వహిస్తారని, ఈనెల 20, 21న ఫేజ్ -2 ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు.

24 నుండి పీజీ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలల్లోగల పిజీ-1,3 సెమిస్టర్ (ఎల్ఎల్ఎం/ఎల్ఎల్బి), పిజీ-5వ సెమిస్టర్ (ఎల్ఎల్బి), ఐఎంబిఏ -7,9 సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ఈనెల 24 నుండి ప్రారంభమవుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ధర్మారం గ్రామంలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరి గౌడ్ వివరాల ప్రకార..ం ధర్మారం గ్రామానికి చెందిన ఈర్నాల రమేష్ (29) పుట్టింటికి వెళ్లిన వెళ్లిన భార్య ఎనిమిది నెలలుగా చిన్న చిన్న గొడవల వల్ల రాకపోయేసరికి ఒంటరిగా ఉంటున్నానని, తనకు ఎవరూ లేరు అనుకుంటూ క్షణికావేశంలో ఊరు శివారులోని చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించమన్నారు.

'ఆర్థిక అక్షరాస్యత' గోడప్రతులు ఆవిష్కరణ



ఆర్థిక అక్షరాస్యత గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు వీలుగా భారత రిజర్వ్ బ్యాంకు రూపొందించిన గోడప్రతులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమావారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, సరైన ఆర్థిక వ్యవహారాలు నిర్వహించడం సురక్షితమని ప్రజల్లో అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఆర్బీఐ ఈ నెల 13 నుండి 17 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తోందని అన్నారు. పొదుపు, సరైన ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్ రూపొందించుకోవడం, డిజిటల్ లావాదేవీల వల్ల సమకూరే లాభాలు తదితర అంశాల గురించి వారోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ నారాయణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఎంపికయిన విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం జెన్ ప్యాక్ట్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ నియమకాలను చేపట్టారు. ఈ నియామకాలకు కామా రెడ్డి, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ లోని డిగ్రీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి టాస్క్ ప్రాంతీయ అధికారి శ్రీనాథ్, ప్రాంగణ కార్యా నిర్వహణ అధికారి సాయి లక్ష్మణ్, జెన్ ఫ్యాక్ట్ సంస్థ అధికారులు శుభంకర్, అచ్చిత్ పాల్గొని ఉద్యోగాలకు అర్హత గల విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ప్రాంగణ నియమకాలలో 135 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్, డైరెక్టర్ దుష్యంత్, ప్రిన్సిపాల్ శైలజ, టిపిఓ హరికృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.



ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్న విద్యార్థులు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి /ధర్పల్లి/బోధన్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని హస కొత్తూరు గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి మార్చి 14 వరకు నిర్వహించబోయే కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లపై సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో గ్రామంలో కంటి వెలుగు నిర్వహణపై ప్రాథమిక ఆరోగ్య శాఖ, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులతో చర్చించారు. కంటి వెలుగు శిబిరం నిర్వహించడానికి గ్రామంలోని విజేత యువజన కళా సంఘ భవనంలో ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో 18 సంవత్సరాలపై వారందరూ కంటి పరీక్షలు నిర్వహించుకునేలా ప్రతి ఇంటింటికి వెళ్లి ఆశా వర్కర్లు, అంగన్వాడీలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సత్యనారాయణ, ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, వార్డు సభ్యులు కుందేటి పుష్ప, నోముల సుమలత, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి, ఏఎన్ఎం మమత, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: రెండవ విడత కంటివెలుగు కార్యక్రమాన్ని మండలంలోని మైలారం గ్రామంలో సర్పంచ్ కుర్రోళ్ళ రమేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ... కంటి సమస్యలతో బాధపడుతూ వైద్యం కోసం జిల్లాకేంద్రాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే తమ సమస్యలు పరిష్కరిస్తూ మంచి వైద్యంతో పాటు ఉచిత కండ్ల అద్దాలను పంపిణీ చేస్తున్న కేసీఆర్ సల్లంగ ఉండాలని పేద ప్రజలు ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారన్నారు. కార్యక్రమములో ఉప సర్పంచ్ కోలి రాజు, డాక్టర్ లలిత, శోభ, వార్డు మెంబర్లు సోమా శేఖర్, ప్రవళిక, సంధ్యారాణి, సిమోన్, ప్రవంతి, ధర్మయ్య గారి గీత, గంగవ్వ, పద్మ, కార్యదర్శి ప్రవీణ్, ఆశ వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : కంటివెలుగు సమావేశంలో సర్పంచ్, తదితరులు

బోధన్: బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ 4వ వార్డులో సోమవారం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిచారు. ఈ సంధర్భంగ ఆయన మాట్లాడుతూ కాలనీ వాసుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒకరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ధూప్ సింగ్, నాయకులు ఉస్మాన్, సాగర్, కిషన్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.



ధర్పల్లి: మైలారంలో కంటివెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం మధ్యాహ్నం 1 గంటల నుండి 2 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండనున్నది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్ ప్రేమ్, పట్టణ అధ్యక్షులు పూజా నరేందర్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్ల అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వర్ రెడ్డి కృషితో అన్నదానం చేపట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకురాలు తార, కౌన్సిలర్ చాలా ప్రసాద్, సుంకరి రంగన్న, పోల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభించిన నాయకులు

నూతన కార్యవర్గానికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

నూతనంగా ఎన్నుకోబడ్డ టీఎన్జీవోస్ అధ్యక్షుడు షికారి రాజు , కార్యదర్శి గోవర్ధన్ స్వామిలను తహసీల్దార్ కార్యాలయం వద్ద గల టీఎన్జీఓస్ భవన్ లో సోమవారం పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలుపుతు, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కెర భూమన్న, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మూగ ప్రభాకర్, శెట్‌పల్లి నారాయణ, మోర్తాడ్ మండల మాజీ అధ్యక్షులు చిన్నయ్య, తుడుం రాకేష్, సంఘం సురేష్, వినోద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఫూలే బీసీ బాలికల గురుకులాన్ని తరలించొద్దు

- బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పరిధిలో ఉన్న జ్యోతిబాఫూలే బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలను పట్టణం నుండి తరలించే యోచనను మానుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైయం ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కలిగోట ప్రశాంత్ మాట్లాడుతూ.....జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థినులు 5వ తరగతి నుండి పదో తరగతి వరకు అభ్యసిస్తున్నారని తెలిపారు. ఇక్కడి నుంచి తరలించే యోచన వల్ల విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులు సైతం ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి పాఠశాల తరలకుండా చూడాలన్నారు. లేదంటే విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైయం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, ఉపాధ్యక్షులు సాయినాథ్ రెడ్డి, పెద్దోళ్ల భరత్, దళిత మోర్చ పట్టణ అధ్యక్షులు పులి యుగంధర్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్ర శివారులోని పెద్దమల్లారెడ్డి ప్రధాన రోడ్డు పై ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మహాత్మా గాంధీ గౌడ్ తెలిపారు. మృతుడు ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావచ్చని, మృతుని వయసు 32 సంవత్సరాలు ఉంటుందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పొస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని దోమకొండ, సంగమేశ్వర్, అంబరిపేట్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో బూత్ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ఆదేశాల మేరకు మండలం లోని అన్ని గ్రామాలలో బియర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, ఎంపీపీ శారదా, సర్పంచ్‌లు అంజలి, సలీమ్, నరేష్, నాయకులు నర్సయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట
- గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికుల ధర్నా
- పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

గ్రామపంచాయతీ సిబ్బందికి, కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, సిబ్బంది ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి, పారిశుద్ధ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని దీనితో వాళ్ళ కుటుంబాలు గడవక చాలా ఇబ్బందులు పడుతున్నారని అక్కడ సర్పంచ్ మరియు గ్రామ పంచాయతీ సెక్రెటరీ జీతాల కోసం అడుగుతే మాకు సంబంధం లేదని చెప్తున్నారని తెలిపారు. కావున వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని గ్రామపంచాయతీ సిబ్బంది కార్మికులకు అందరికీ పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని జీవో నంబర్ 60 ప్రకారం కనీస వేతనాలు 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నర్సింలు, సంతోష్, యాదగిరి, మణెమ్మ, యాదమ్మ, రాజు, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలాల్ జయంతి రోజు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

నవతెలంగాణ-గాంధారి

సేవాలాల్ జయంతి రోజు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని బంజారా నాయకులు డిమాండ్ చేశారు. గాంధారి మండల కేంద్రంలోని సేవలాల్ జగదాంబ ఆలయం వద్ద గాంధారి మండల బంజారా యువజన సంఘం జెఏసి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఏసి నాయకుడు ప్రేమదాస్ మాట్లాడుతూ జయంతి ఉత్సవాలకు పార్టీలకు అతీతంగా అన్ని పార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



ఎస్పీకి ఆహ్వానపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో వెలిసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ నుండి జరగనున్న శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డికి సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. అదే విధంగా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, సర్పంచ్ బొమ్మేడి రాంరెడ్డి, బిఆర్‌యస్ మండల యూత్ అధ్యక్షులు గడ్డం రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు రేకులపల్లి రాజిరెడ్డి, పెంద్యాల నర్సారెడ్డి, గంజి ఆంజనేయులు, బండి ప్రవీణ్, బొమ్మిడి రఘుపతి రెడ్డి, తోట లింగం తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-మద్నూర్

పశువులకు ముద్దచర్మ వ్యాధి, ఇతర వ్యాధులు నివారణ, వ్యాక్సినేషన్ కోసం డోంగ్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రామ్ పటేల్ కోరారు. పశువైద్య శిబిరాలను సోమవారమిక్కడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ముద్ద చర్మ వ్యాధి సోకుతున్నందున ఆ వ్యాధి నివారణ కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరాలను పశువులదారులు వ్యవసాయదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ ముద్ద చర్మ వ్యాధి నివారణ కోసం పశువైద్య డాక్టర్ వినీత్ కుమార్ పశువైద్య సిబ్బంది పశువులకు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో డోంగ్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శశాంక్ పాటిల్, సొసైటీ డైరెక్టర్ అశోక్ పటేల్, పార్టీ మండల ఉపాధ్యక్షులు ఆనంద్ పాటిల్, వైస్ ఎంపీపీ జైపాల్‌రెడ్డి, బావురావు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల కుటుంబాలకు భరోసా

- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎంపీపీ



చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-జుక్కల్

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం.. పేదింటి ఆడపిల్లల కుటుంబాలకు ఆర్థికం గా భరోసా ఇస్తుందని జుక్కల్ ఎంపిపి సుర్నార్ యశోదా అన్నారు. సోమ వారం మండల పరిషత్ కార్యాల యంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ సాయాగౌడ్, ఎంపీపీ యశోదా, విండో చైర్మన్ నాగలగిద్దె శివానంద్, వివిధ గ్రామాల సర్పంచు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి యశోదా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఎర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసి తోబుట్టువుగా ఉంటూ ఆ కుటుంబంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి యశోదా, విండో చైర్మేన్ శివానంద్, మార్కెట్ చైర్మేన్ సాయాగౌడ్, మాజీ ఎంపిపి శెట్కార్ బస్వంత్ రావ్, సర్పంచులు జుక్కల్ బి.రాములు, డీటీ విజయలక్ష్మీ, ఆర్ఐ రామ్‌పటేల్, బీఆర్ఎస్ సీనీయర్ నాయకులు నీలుపటేల్, శివరాజ్ దేశాయి, వెంకట్ రావ్ పటేల్ పాల్గొన్నారు.

సొసైటీ భూమిని రక్షించండి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న మహిపాల్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ గ్రామ పంచాయతీకి చెందిన 0-18 గుంటలు సొసైటీ భూమి సొసైటీకి చెందేలా చూడాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు మహిపాల్ యాదవ్ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ కలిసి వినతి పత్రం అందజేశారు. 306/5 సర్వే నెంబర్ గల భూమిలో 1985 సంవత్సరంలో 18 గుంటలు అప్పటి ధర్మారావుపేట్ సొసైటీ వారు అలకొండ పెద్ద అంజయ్య, అలకొండ చిన్న అంజయ్య దగ్గర కొనుగోలు చేసినట్టు తెలిపారు. అయినప్పటికిని అది ఇప్పటికీ సొసైటీ పేరు మీదకు మ్యూటేషన్ కాలేదు. దయచేసి ఇప్పటికైనా ఇట్టి 0-18 గుంటల సొసైటీ భూమి స్వాధీనం చేసుకోనీ పూర్తి 0-23 గుంటల ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని కోరడం జరిగిందని తెలిపారు.

కంటివెలుగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పిట్లం

కంటి వెలుగు విజయవంతానికి ఎంపీఓ బ్రహ్మం, పంచాయతీ సెక్రెటరీ యాదగిరి పలువురికి అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రంలోని మజీద్, లారీ అసోసియేషన్, ఐకెపి కార్యాలయ అధికారినికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న కంటి వెలుగు పరీక్షల నిమిత్తం మజీద్ మైనారిటీ పెద్దలు, లారీ అసోసియేషన్ పాలకవర్గ సభ్యుల ప్రతి కుటుంబ సభ్యులు నిర్ణీత సమయంలో పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళా పొదుపు సంఘాల సభ్యులను ప్రోత్సహించి కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగ పర్చుకొనునట్లు చూడాలని ఐకెపి ఏపీఎం శిరీషను కోరారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. అదే విధంగా కంటి సమస్య తీవ్రంగా ఉండి అవసరమైన వారికి కంటి ఆపరేషన్‌లు సైతం ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీం, మజీద్ పెద్దలు, లారీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌వి ఎలక్షన్, కలెక్షన్ పథకాలే

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి




మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశ పెడుతున్న పథకాలన్నీ ఎలక్షన్‌లు, కలెక్షన్ల కోసమేనని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోస్లి, మద్దేపల్లిలలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిపై ప్రచారం చేశారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహిస్తూ రాష్ట్రంలో కెసిఆర్ కేవలం ఎలక్షన్లలో గెలిచేందుకు ఓటర్లను మభ్య పెట్టేందుకే దళిత బంధు, గిరిజన బంధు అంటూ డ్రామాలు చేస్తున్నారని అవి కేవలం నాయకులకు కలెక్షన్లకు పనికివస్తున్నాయే తప్ప పేద ప్రజలకు అందడం లేదని విమర్శించారు. దేశంలో పేద ప్రజలపై బారాలు మోపడమే కాక టాక్స్ ల రూపంలో వసూలు చేసిన 50 శాతం ధనం అంబానీ, ఆదానిలా పాలు చేస్తున్నారని అన్నారు. అలాగే మత విద్వేషాలు పెట్టి రాజకీయ పబ్బం గడుపుతున్నారని అన్నారు. అందుకే రాహుల్ గాంధీ ఎండనక, వాననక, చలిఅనక ఏడు నెలలు హాత్ సే హాత్ జోడోయాత్ర చేపట్టి ప్రజలను చైతన్యం చేస్తున్నారని అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, మానాల మోహన్ రెడ్డి, సుధాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



యజ్ఞం చేస్తూ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని గంగ్ శెట్టి హనుమాన్ మందిరం వద్ద గల సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం కాకడ హారతి అనంతరం బాబా వారికి ప్రత్యేక పంచామృత అభిషేకం పూజలు చేపట్టి యజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలంలో పాటు మహరాష్ట్ర నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఆలయాన్ని దర్శించుకున్నారు.

అంగరంగ వైభవంగా మల్లన్న పండుగ



మల్లన్న పండుగలో భాగంగా పట్నాలు

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో సోమవారం మల్లన్న పండుగ కార్యక్రమాన్ని యాదవ సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మల్లన్న ఎల్లమ్మ కళ్యాణం, అగ్ని గుండాలు, గంపలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తనయుడు గంప శశాంక్, బిజెపి కామారెడ్డి ఇంచార్జ్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎన్ఆర్ఐ బల్ల సాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం యాదవ సంఘ సభ్యులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా చేపట్టాలి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్/నిజామాబాద్‌సిటీ



కామారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న డీఐఈవో

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 2 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, జిల్లా పరీక్షల నియంత్రణ కమిటీ ప్రతినిధులు అజ్మల్ ఖాన్, డి. నిజం, అధికారులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : జిల్లాలో జూనియర్ కళాశాల లలో ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు అప్రమత్తంగా ఉంటూ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ ఆదేశించారు. ఈ నెల 15 నుండి మార్చి 2 వరకు జరగనున్న ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్‌ల సమావేశం సోమవారం నిజామాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ (ఖిల్లా) కళాశాలలో నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో ఏ చిన్న సమస్య అయినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు ఎగ్జామినర్ల నియామకం పూర్తయిందని ఒకరోజు ముందుగానే ఎగ్జామినర్లు రిపోర్ట్ చేసే విధంగా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అలాగే ఆయా చీఫ్ సూపరింటెండెంట్‌లు తమ కళాశాలలో పరీక్షల నిర్వహణ విధులు కేటాయించిన అధ్యాపకులను ఒకరోజు ముందుగానే రిలీవ్ చేయాలని ఆదేశించారు. పరీక్ష ప్రశ్నాపత్రాలు ఆన్లైన్ లో మాత్రమే డౌన్లోడ్ అవుతాయని, ఎగ్జామినర్లకు అరగంట ముందు పాస్ వర్డ్ వస్తుందని దాని ద్వారా మాత్రమే ప్రశ్నాపత్రాలను డౌన్లోడ్ చేసుకోగలుగుతారని వివరించారు. విద్యుత్ సరఫరా లో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా విద్యుత్ అధికారులకు సమాచారం అందించినట్టు తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు విద్యుత్ సమస్య నెట్వర్క్ సమస్య అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని పరీక్షల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉదయం, మధ్యాహ్నం సెషన్ లలో విధులు నిర్వహించే ఎగ్జామినర్ లు ముందుగా రిపోర్టు చేయని యెడల తమకు సమాచారం అందిస్తే వారి స్థానంలో మరో ఎగ్జామినర్‌ను నియమిస్తామని జిల్లా ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు. ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయిన వెంటనే ఎగ్జామినర్లు మార్కులను ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని అన్నారు. అలాగే జవాబు పత్రాలను సంబంధిత అధికారులకు పంపడానికి సీలు వేసి పంపించాలని అన్నారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే విధంగా అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపర్డెంట్లు వారికి కేటాయించిన కళాశాలల యాజమాన్యాలకు ప్రిన్సిపాల్ లకు ముందస్తు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మూడు దశలలో నిర్వహించనున్న ప్రాక్టికల్ పరీక్షలకు ప్రతి ఒక్క విద్యార్థి హాజరయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్ లు శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రయోగశాలలో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని, పరీక్షలను పర్యవేక్షించేందుకు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య, కనకమహాలక్ష్మి, హైపవర్ కమిటీ సభ్యుడు రజియుద్దిన్ అస్లాం,స్క్వాడ్ బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారని అన్నారు. ఇంటర్ బోర్డు అధికారులు పర్యవేక్షణ, తనిఖీ చేస్తారని అన్నారు. ఈ సమావేశంలో నిజామాబాద్ పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య, కనకమహాలక్ష్మి, ప్రిన్సిపాల్‌ల సంఘం అధ్యక్షులు చిరంజీవి, బాలుర కళాశాల ప్రిన్సిపల్ యకీనుద్దీన్, లెక్చరర్ల సంఘం అధ్యక్షులు నరసయ్య, జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పరీక్షా కేంద్రాలు కేటాయించిన ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు, చీఫ్ సూపర్డెంట్లు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవతెలంగాణ-రామారెడ్డి

తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గిద్ద గ్రామానికి చెందిన పెనుగొండ బాలరాజు భార్యతో కలిసి శనివారం బంధువుల ఇంటికి వెళ్లి, తిరిగి సోమవారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపుల, బీరువా తాళాలు పగలగొట్టి శివాలయం గుడికి సంబంధించిన రూ, 15000, సొంత డబ్బులు రూ, 5000, గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని బాధితుల ఫిర్యాదు మేరకు కేదు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

15న సెలవు దినంగా ప్రకటించాలి

కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన బంజారా లంబాడీల ఐక్యవేదిక నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బంజారా(లంబాడీల) ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని లంబాడిల ఐక్యవేదిక తరపున సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతిని నిర్వహించడం చాలా సంతోషకరమని అన్నారు. అదేవిధంగా ఈసారి 284 వ జయంతి రోజు సెలవు ప్రకటించాని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షుడు కాట్రోత్ రవీందర్ నాయక్, జిల్లా ఇన్చార్జ్ మాలోత్ విట్టల్ నాయక్, జిల్లా మీడియా ఇంచార్జ్ అశోక్ వర్మ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి అండగా

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని వెల్మల్ గ్రామంలో మల్లన్న స్వామి మందిరం దగ్గర పునర్నిర్మిస్తున్న హనుమాన్ మందిరానికి 31వేలు అదే గ్రామానికి చెందిన నవయుగ ఫౌండేషన్ (1999-2000 బ్యాచ్) సభ్యులు విలేజ్ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ... గ్రామంలో ఎక్కడ ఏమైనా ఆర్థిక ఇబ్బంది ఉన్నట్లయితే వెంటనే తమ పౌండేషన్ సభ్యులు ముందుండి తోచిన సహాయం చేసి ఆదుకుంటామన్నారు. నవయుగ పౌండేషన్ సభ్యులకు గ్రామ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ నియోజకవర్గ కురుమ సంఘ నాయకులు కేజీ సురేష్, ఫౌండేషన్ సభ్యులు, బట్టు కృష్ణ, బైన రవి, నాగ గంగాధర్, చిలుక భూమేష్ సత్యం, విలేజ్ కమిటీ సభ్యులు సురేష్, తిరుపతి, పోతన్న పాల్గొన్నారు.

పావలావడ్డీ, అభయ హస్తం ఏమైంది?

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట డ్వాక్రా మహిళల ధర్నా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డ్వాక్రా గ్రూపులకు కొన్ని ఏళ్ళ నుండి పావలా వడ్డి రావడం లేదని, అభయహస్తం ద్వారా డబ్బులు కట్టించుకుని ఇప్పటి వరకు అతీగతి లేదని, ఎవరైనా మహిళ మృతిచెందితే ఆమహిళపై ఉన్న అప్పును మాఫీ చేయాలని కోరుతూ సోమవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని మహిళలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మెహమ్మద్ వాహిద్‌కు డ్వాక్రా గ్రూపు మహిళా సంఘ సభ్యురాలు సవిత అధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలకు పావలా వడ్డి వర్తించడం లేదని, ప్రతి మహిళకు ఇన్సూరెన్సు కల్పించాలని, డ్వాక్రా గ్రూపులో ఉన్న బీద మాహిళల పిల్లలకు స్కాలర్ షిప్పులు అందించాలని, పేద మాహిళలకు ఇంటి స్థలాలు అందజేసి ఇళ్ల నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను నెలా రోజుల్లో పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలంలోని మహిళలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళలు

యూజీ పరీక్షల్లో ముగ్గురు డిబార్..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం మధ్యాహ్నం జరిగిన యూజీ 1వ సెమిస్టరు (రెగ్యులర్) పరీక్ష లో 10,424మంది విద్యార్థులకు గాను 9585మంది హాజరయ్యారని, 839 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరిక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్ ఎన్విరాన్మెంటల్ సబ్జెక్ట్ పరీక్షలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు డిబార్ కాగా,శ్రీ విశ్వశాంతి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మరొక విద్యార్థి డిబార్ అయ్యారని పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన వేల్పూర్ జడ్పీటీసీ

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

ఇటీవల భాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రాజీవ్ గాంధి హనుమంతు ను సోమవారం నగరంలోని ఇంటిగ్రెటెడ్ కలెక్టర్ కార్యాలయంలో వేల్పూర్ జడ్పిటిసి అల్లకొండ భారతి రాకేష్ చంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నందిపేట్‌ను నంబర్ వన్ చేస్తా

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

నవతెలంగాణ-నందిపేట్

రానున్న రోజుల్లో నందిపేట్ గ్రామాన్ని నంబర్ వన్ చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పీయూసీ చైర్మన్ ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం నందిపేట్ గ్రామాభివృద్ధి కమిటీ సర్వసమాజ్ అన్ని కులాల ఆధ్వర్యంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిశారు. గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు గ్రామ అభివృద్ధి కమిటీ భవనానికి రూ. 50 లక్షలు మంజూరు చేసి నిర్మించాలని, ఐదున్నర కోట్లతో సిసి రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, ప్రతి సోమవారం నిర్వహించే వారంతపు సంతకు స్థలం, కేటాయించాలని, 12 కోట్ల రూపాయలతో నందిపేట మెయిన్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, నందిపేట గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చాలని, ప్రభుత్వ స్థలాలు, చెరువు భూములను రక్షించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, నందిపేట గ్రామాభివృద్ధి కమిటీ అడిగిన వాటన్నింటినీ తీరుస్తానని హామీనిచ్చారు. దీంతో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి ఆయనకు వచ్చే ఎన్నికల్లో అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నందిపేట్ గ్రామాభివృద్ధి కమిటీ సర్వ సమాజ్ అధ్యక్షులు, నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, అధ్యక్షులు పండరి రాజు, కుమ్మరి సాగర్, గ్రామంలోని అన్ని కులాల పెద్ద మనుషులు నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నరు..

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పాత బస్టాండ్ హుస్నాబాద్ గల్లి ప్రాంతంలో ఇష్టంవచ్చినట్లు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, అలాగే రోడ్డుపై దుకాణదారులు పెద్ద పెద్ద బండలను ఉంచి స్థలాన్ని ఆక్రమిస్తున్నారని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్‌ను కలిసి హుస్నాబాద్ కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత బస్టాండ్ లోపల దాని పక్కనగల సందులో ఇష్టం వచ్చినట్టు వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల ఎమర్జెన్సీ ఉన్న సమయంలో కూడా అంబులెన్స్ లోనికి రాక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నామని అన్నారు. రెండు రోజుల క్రితం ఒకరికి సీరియస్‌గా ఉండడంతో అంబులెన్స్‌కి దారి ఇవ్వలేదని, దీంతో పెద్ద గొడవ జరిగిందని వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకొని అడ్డంగా ఉన్న కోకాలను, అలాగే దుకాణాల ముందు బండరాళ్లు తొలగించి కాలనీలోకి వెళ్లడానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు,

డిపాజిట్ డబ్బులు ఇవ్వలేదు

- ప్రజావాణిలో తాళ్ళ రాంపూర్ డిపాజిటర్ల ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో కొన్ని సంవత్సరాల క్రితం డిపాజిట్లు పెట్టిన డిపాజిట్ దారులను మాజీ చైర్మన్ నిండా ముంచింది అందరికి తెలిసిందే. అయితే తాళ్ళ రాంపూర్ పీఏసీఎస్‌లో రైతులతో సమావేశం తర్వాత డబ్బులను ఇప్పిస్తానని హామీనిచ్చి అధికారులు కాలయాపన చేయగా విసుగుచెందిన రైతులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉన్నపలంగా డీసీఓ సింహాచలంను ప్రజావాణికి పిలిపించి రైతుల సమక్షంలో అడిగారు. ఈ నెల చివరి వరకు తాళ్ళ రాంపూర్ డిపాజిట్ దారులకు డబ్బులను అందజేస్తామని సింహాచలం చెప్పినట్టు డిపాజిట్ దారులు తెలిపారు.

నైపుణ్యాన్ని వెలికి తీయడమే భారత జాగృతి లక్ష్యం

- కేసీఆర్ కప్ 2023 రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్
- 15, 16న లాల్ బహదూర్ స్టేడియం హైదరాబాద్‌లో పోటీలు
- భారత జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతిరావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలిగితీయడమే భారత జాగృతి లక్ష్యమని భారత జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి రావు అన్నారు. సోమవారం నగరంలోని భారత జాగృతి జిల్లా భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతజాతి జిల్లా అధ్యక్షులు అవంతి రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ నాయకులు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ జాగృతి నిర్వహిస్తున్న కేసీఆర్ కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఈ సంవత్సరం ఉంటుందని తెలిపారు. కేసీఆర్ కప్ 2023 రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల వాలీబాల్ టోర్నమెంట్ ఈనెల 15, 16, తేదీల్లో లాల్ బహదూర్ స్టేడియం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి ట్రోఫీ, మెడల్స్, లక్ష నగదు, ద్వితీయ బహుమతిట్రోఫీ, మెడల్స్ 50వేలనగదు, తృతీయ బహుమతి ట్రోఫీ, మెడల్స్ 25వేల నగదు, ప్రోత్సాహక బహుమతులు ఉన్నాయని తెలిపారు. వివిధ విభాగాల వారీగా ఉత్తమ క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేష్ గౌడ్, జాగృతి నాయకులు లక్ష్మీనారాయణ భరద్వాజ్, నరాల సుధాకర్, సాయికృష్ణ, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అవంతిరావు

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా?

- జిల్లా ఆర్థిక ప్రణాళిక సభ్యులు, ధర్పల్లి జడ్పీటీసీ, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇతర పార్టీల నాయకులకు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడం లేదా..? కేవలం ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తు బురదజల్లే కార్యక్రమం పెట్టుకున్నారని, కేంద్రంలోని మంత్రులు, అధికారులు ఇక్కడికి వచ్చి రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను చూసి ప్రభుత్వానికి కితాబు ఇస్తున్నారని, ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనకు నిదర్శనమని జిల్లా యువ నాయకులు, జిల్లా ఆర్థిక ప్రణాళిక సభ్యులు, ధర్పల్లి జడ్పిటిసి, ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని డిచ్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురుకి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎంతో మంది పేద మధ్య తరగతి కుటుంబాలను ఆదుకుంటుందని, ముఖ్యమంత్రి సహాయనిధి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తుందని అన్నారు. డెంగ్యూ వంటి వ్యాధులు వస్తే అప్పో సొప్పో చేసి ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొంది వాటికి అయిన బిల్లులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నామని తెలిపారు. కరోనా వల్ల మూడు ఏళ్ళు ప్రపంచమే అతలాకుతలం అయ్యిందని, కాని ముఖ్యమంత్రి చొరవతో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకున్నారని తెలిపారు. కల్యాణలక్ష్మీ, షాది ముబారక్ వంటి సంక్షేమ పథకాలతో పేద బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో సంతోషం కలిగిస్తుందని పేర్కొన్నారు. అనంతరం 12మంది లబ్దిదారులకు రూ.4లక్షల95 వేల విలువగల చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింతా శ్రీనివాస్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నారాయణరెడ్డి,సినియర్ నాయకులు మోహమ్మద్ యూసఫ్, ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సతీష్ రెడ్డి, నవీన్, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న జగన్

ఏఎంసీలో ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం


మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి ఆయేషాఫాతిమ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోధన్ ఎమ్మెల్యే సతీమణి అయేషాఫాతిమా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మహిళ సిబ్బందికి, అగ్రికల్చర్ మహిళ ఏఈఓలను ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా మాట్లాడుతూ.. మహిళలు గృహిణులుగా, ఉద్యోగులుగా, రాజకీయ రంగాల్లోనూ కాకుండా అని రంగాల్లో రాణించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వి.ఆర్ దేశాయ్, బోధన్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సునీత దేశాయ్, మహిళా నాయకురాలు గట్టు రాణి, ప్రభావతి, జర్నలిస్ట్ మౌని, మార్కెట్ కమిటీ గ్రేడ్ 3 సెక్రటరీ మెర్సి, తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న పాలకులు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయిస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ విభజన హామీల్లో ఉన్న విద్యాసంస్థలను తెలంగాణలో ఏర్పాటు చేయకుండా మోడీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం విద్యాలయాల్లో విద్యార్థుల మధ్య మతాల, కులాల పేరిట చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తూ అధికారంలోకి రావాలని చూస్తుందని తెలిపారు. రాజ్యాంగ హక్కులను సైతం ఉల్లంఘిస్తూ భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తుందని అన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయడంలేదని, బడ్జెట్ లో విద్యకు 7శాతం నిధులు మాత్రమే కేటాయిస్తూ విద్యారంగం పట్ల చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. మెస్ చార్జీల పెంపు లేదని, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు లేవని, యూనివర్సిటీ లు అభివృద్ధికి నోచుకోవడంలేదని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఇప్పటికీ అమలు లేదని అన్నారు. విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి, రఘురాం, జిల్లా కమిటీ సభ్యులు సుభోద్, ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు అభిరామ్ పాల్గొన్నారు.

ఆదాని స్టాక్స్ కుంభకోణంపై విచారణ చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ఆదాని స్టాక్స్ కుంభకోణంపై విచారణ జరిపి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎల్లమ్మ గుట్ట లో గల ఎల్ఐసి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ అండదండలతో ప్రపంచంలోనే రెండవ కుబేరుడుగా ఎదిగిన ఆదాని స్వతంత్ర భారతదేశంలో నిర్మించుకున్న ఎల్ఐసి నుంచి 80 వేల కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి 5300 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి 7 వేల కోట్లు, ఎస్బిఐ నుంచి 25వేల కోట్లు ఇలా అనేక బ్యాంకుల నుంచి ఆదాని కంపెనీలలో నరేంద్ర మోడీ ఆదేశాలతోనే పెట్టుబడులు పెట్టినట్లు బహిర్గతమవుతున్నదని అన్నారు. ఈ కుంభకోణం బయటకు వచ్చిన తర్వాత ఆదాని ఆర్థిక సామ్రాజ్యం పేక మెడల్లాగా కూలిపోవడంతో ఆ నష్టంతో భారతదేశ సార్వభౌమత్వ నిర్మాణానికే పెద్ద దెబ్బ తగిలిందన్నారు. ఆ నష్టం ఆదానిది కాదు.. దేశ ప్రజలదని, ఎల్ఐసి దాదాపు 40 వేల కోట్లు నష్టపోయిందని, ఎస్‌బిఐకి 9 వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. వీటన్నిటి పై విచారణ చేయాలని, దేశంలోని అన్ని పార్టీలతో కూడిన జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ నరేంద్ర మోడీ దాని ప్రస్తావనే తీసుకురాకుండా ప్రతిపక్షాల మీద ఎదురుదాడికి పూనుకోవడం అంటే దేశ ప్రజల పైన దాడి చేయడమని అనానరు. ఏఐయస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి మాట్లాడుతూ 2023-2024 కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి నామమాత్రంగా నిధులు కేటాయించి చేతులు దులుపుకోవడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వై. ఓమయ్య, కే.రాజన్న, రఘురాం,రంజిత్, అంజలి,బొంబాయి.గంగాధర్, పి.హనుమన్లు, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డగింత

నవతెలంగాణ-ఆర్మూర్


వివాహాన్ని నిలిపివేసిన ఐసీఈఎస్ సిబ్బంది

పట్టణం లోని టీచర్స్ కాలనీ కి చెందిన 16 సం 8నెలలు అమ్మాయికి బాల్య వివాహం చేయటానికి ప్రయత్నం చేయగా సోమవారం ఐసీడీఎస్ సిబ్బంది అక్కడికి వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి పెళ్లి ఆపారు. అ బాలిక తల్లి తండ్రులను సీడబ్ల్యూఎస్ కమిటీ ముందు హాజరు పరుస్తామని ఐసీడీఎస్ అధికారిని విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నళిని, అంగన్వాడీ టీచర్స్ దుర్గ, విఖిల, వార్డు కౌన్సిలర్ కొంతం మురళి తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్వయం సమృద్ధి చెందడమే లక్ష్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేశంలో వ్యవసాయ రంగం కీలకమైనదని దాని మీద ఆధారపడి భూమిని నమ్మిన సన్న, చిన్న కారు రైతులు వ్యవసాయం చేస్తున్నపుడు భూమికి ఎప్పుడు ఏమి కావాలని అడుగుతు సకాలంలో దానికి అవసరం అయినవి అందిస్తూ ఎన్ని ఇబ్బందులు ఉన్న అందులో వచ్చే ఫల సాయంతో బతుకుతున్నారని అలాంటి వారిని స్వయం సమృద్ధి పరచడం, వారి ఆర్థిక అభివృద్ధి కి తోడ్పాడడం ఎఫ్ పిఓ లక్షంగా ఉందని, ఇలాంటి సంస్థలో రైతులు ఉండి వారి ఆర్థిక అభివృద్ధి ని మెరుగు పరుచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. డిచ్ పల్లి మండల కేంద్రంలోని కెఎన్ఆర్ గార్డెన్ లో ఇందురు డిచ్ పల్లి రైతు ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్ పిఓ కంపెనీ, లిమిటెడ్)చైర్మన్ ఎం నాగయ్య అధ్యక్షణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రైతులంతా ఐక్యంగా ఉండాలని తమ ఉత్పతులను మధ్య దళారీ వ్యవస్థలకు కాకుండా నేరుగా అమ్ముకునే అవకాశం ఈ ఎఫ్ పిఓ లకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశం లో చైర్మన్ ఎం నాగయ్య తో పాటు మేనేజింగ్ డైరెక్టర్ కొండేలా సాయరెడ్డి డైరెక్టర్ పాపయ్య వేల్పూర్ భూమయ్య నాప్కాన్ జిల్లా అధికారి థామస్, మోడీ రాజలింగం మాట్లాడారు.అనంతరం పలు తీర్మాణాలు ఆ మోదించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పెంటయ్య, భూమా రెడ్డి, రాజన్న, వెంకట్ రెడ్డి, అఖిల సాయినాథ్ రెడ్డి, వి సాయినాథ్ తోపాటు రైతులు పాల్గొన్నారు.

పుష్కర కాలం నాటి సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గడిచిన పుష్కర కాలం నుండి నెలకొని ఉన్న సమస్యకు స్థల దాత చొరవతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. డిచ్పల్లి మండలం కొరట్ పల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణం విషయం స్థల వివాదం తలెత్తడంతో 12 సంవత్సరాల నుండి ఈ సమస్య అపరిష్కృతంగా ఉండిపోయింది. ఇటీవల అధికారులు గ్రామాన్ని సందర్శించి స్థల వివాదం విషయమై కాలనీవాసులతో చర్చించారు. ఈ సందర్భంగా స్థానికుడైన సురసాని రాంరెడ్డి డ్రైనేజీ నిర్మాణం కోసం తన సొంత పట్టా భూమిని అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఉదారత్వాన్ని చాటుకున్నారు. రాంరెడ్డి చొరవతో కొరట్ పల్లిలో సుదీర్ఘ కాలం నుండి అపరిష్కృతంగా ఉండిపోయిన సమస్య కొలిక్కి వచ్చింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో స్థల దాత రాంరెడ్డిని అభినందిస్తూ శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, బి.చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జయసుధ, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ పీ.డీ. చందర్, నిజామాబాద్ డీ.ఎల్.పీ.ఓ నాగరాజు పాల్గొన్నారు.


భూ దాతను సన్మానిస్తున్న కలెక్టర్, తదితరులు

శివాజీ విగ్రహం గద్దె నిర్మాణానికి చర్యలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం గద్దె నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఆదేశాల మేరకు మున్సిపల్ డీఈ శివానందం, పీఆర్ ఏఈ సాయిలు స్థలాన్ని పరిశీలించారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి శోభనిచ్చేలా అందమైన ఆకృతిలో గద్దె నిర్మాణం చేపట్టడానికి ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారుల వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ ఉన్నారు.

ప్రతిపక్ష నేతలు పసలేని విమర్శలు మానుకోవాలి

ఎమ్మెల్యే షకీల్ ఆమేర్

నవతెలంగాణ - బోధన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రతిపక్ష పార్టీల నేతలు తనపై పసలేని విమర్శలు మానుకోవాలని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ హెచ్చరించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అవినీతికి పాల్పడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఎండల చేస్తున్న ఆరోపణలు శుద్ధ దండగని అన్నారు. నిజానిజాలు తెలుసుకోవాలంటే తన రైస్ మిల్ వద్ద సెక్యూరిటీ ఉద్యోగం చేసి తెలుసుకోవాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులకు ప్రజలు నమ్మకపోవడంతోనే లేనిపోని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. నూతన అసెంబ్లీని కూల్చేస్తామని బండి సంజయ్ అనడం ఆయన అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ ఉన్నత ప్రమాణాలతో ఆలయాలు అభివృద్ధి చేస్తే వారు సహించడం లేదన్నారు. మాజీ మంత్రిగా చేసిన ఓ నాయకుడు ఏనాడు ప్రజల గురించి పట్టించోలేదని విమర్శించారు. తనపై నిరాధారణ ఆరోపణలు మాని కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా కృషి చేయాలన్నారు.ఈ విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, నాయకులు ఉన్నారు.